

ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో రహదారిని దిగ్బంధించిన రైతులు

## పారిస్‌ను ముట్టడించిన రైతులు

పారిస్: ఉక్రెయిన్ యుద్ధం ప్రభావం ఫ్రాన్స్ రైతులపై విపరీతంగా పడుతున్నది. దీంతో రైతన్నలు తమ డిమాండ్ల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు. దీనిలో భాగంగా సోమవారం తమ ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, పెద్ద పెద్ద గడ్డివాములతో పారిస్‌ను ముట్టడించారు. పారిస్‌కు వెళ్లే మార్గాలను ట్రాక్టర్లతో దిగ్బంధనం చేశారు. ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టి కనీసం నెల అయినా కాకమునుపే గాబ్రియెల్ అటల్‌కు ఇది కష్టకాలంగానే కనిపిస్తున్నది. నిరసనకారులు మాట్లాడుతూ, పీఎం అటల్ గత వారం ప్రకటించిన చర్యలు తమ డిమాండ్లకు తగినట్లుగా లేవన్నారు. ఆహారోత్పత్తి చాలా ఆకర్షణీయంగా, సులభంగా, న్యాయంగా ఉండాలన్నది తమ డిమాండ్ అని చెప్పారు. తమకు మరిన్ని రాయితీలు కావాలన్నారు. ప్రభుత్వం తమకు అనుకూలంగా స్పందించకపోతే ఎంత కాలమైనా ధర్నా చేసేందుకు కొందరు నిరసనకారులు ఆహారం, నీరు, టెంట్లను తీసుకొచ్చారు.

## మాల్దీవులు అధ్యక్షుడిపై అభిశంసన తీర్మానం!

మాలే, జనవరి 29: మాల్దీవులు పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్ష ఎంపీల మధ్య గొడవ అనంతరం అక్కడి రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. మాల్దీవులు అధ్యక్షుడు మహమ్మద్ మయిజ్జుకు వ్యతిరేకంగా ఆ దేశ పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రధాన ప్రతిపక్షం ఎండీపీ, డెమొక్రాట్స్ సిద్ధమవుతున్నారు. అంతేగాక సోమవారం పార్లమెంట్‌లో మయిజ్జు సర్కార్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చైనాకు అనుకూలంగా వ్యవహరించే నలుగురు సభ్యులను మయిజ్జు సర్కార్ క్యాబినెట్‌లోకి తీసుకోగా, ఇందులో ముగ్గురు సభ్యుల్ని క్యాబినెట్‌లోకి తీసుకోవటాన్ని పార్లమెంట్ తిరస్కరించింది.

## నలుగురు మొసాద్ ఏజెంట్లకు ఇరాన్‌లో ఉరిశిక్ష

తెహ్రాన్, జనవరి 29: ఇజ్రాయెల్ కోసం గూఢచర్యానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై నలుగురికి ఇరాన్ మరణశిక్ష అమలుచేసింది. దేశ రక్షణ విభాగానికి చెందిన ఓ స్థావరాన్ని పేల్చివేసేందుకు ప్లాన్ చేసినట్టు నలుగురిపై నమోదైన అభియోగాలు న్యాయస్థానంలో రుజువయ్యాయి. దాంతో గత ఏడాది సెప్టెంబర్‌లో అక్కడి న్యాయస్థానం నలుగురికి ఉరిశిక్ష విధించగా, దానిని సోమవారం అమలుచేశారు. ఉరిశిక్ష అమలైన వారిలో ముగ్గురు పురుషులు కాగా, ఒక మహిళ ఉన్నారు. వీరికి ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్ ఆఫ్రికా దేశాల్లో శిక్షణ ఇచ్చినట్టు అధికారులు తెలిపారు.

## సముద్ర దొంగల ఆటకట్టించిన భారత నేవీ

న్యూఢిల్లీ, జనవరి 29: సముద్ర దొంగల ఆటకట్టించటంలో భారత నేవీ సత్తా చాటింది. సోమాలియా సముద్ర దొంగలు హైజాక్ చేసిన ఇరాన్ పడవను.. అందులోని 17 మంది సిబ్బందిని భారత నేవీ రక్షించింది. భారత యుద్ధ నౌక ఐఎన్ఎస్ సుమిత్రాను రంగంలోకి దింపి.. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టామని, ఇరాన్ చేపల పడవను, అందులోని మొత్తం సిబ్బందిని సురక్షితంగా విడిపించామని ఇండియన్ నేవీ సోమవారం ప్రకటించింది. మరోవైపు, శ్రీలంక మత్స్యకారుల పడవ ఒకటి వారం క్రితం సోమాలియా దొంగలకు చిక్కగా, పడవను, అందులోని ఆరుగురు మత్స్యకారులను కాపాడినట్టు శ్రీలంక నేవీ ఆదివారం ప్రకటించింది. రెస్క్యూ ఆపరేషన్‌కు భారత నేవీ సాయం చేసినట్టు తెలిపింది.

# కట్టెల పొయ్యి పైనే వంట!

**ఇప్పటికీ వినియోగిస్తున్న 41% దేశ జనాభా**

- ఏటా 34 కోట్ల టన్నుల సీవో2 విడుదల
- దేశ కర్బన ఉద్గారాల్లో 13 శాతం
- పరివర్తనకు హామీ ఇవ్వని 'ఉజ్వల'
- సీఎస్ఈ తాజా అధ్యయనం వెల్లడి

*న్యూఢిల్లీ, జనవరి 29: దేశంలోని 41 శాతం మంది జనాభా వంటకు ఇంధనంగా ఇప్పటికీ కట్టెలు, ఆవు పేడ వంటి ఇతర బయోమాస్ పదార్థాలను వినియోగిస్తున్నారని తాజా అధ్యయనం పేర్కొన్నది. దీని వల్ల ప్రతి ఏడాది 34 కోట్ల టన్నుల కార్బన్‌డై ఆక్సైడ్ వాయువు వాతావరణంలోకి విడుదల అవుతున్నదని, ఇది భారత కర్బన ఉద్గారాల్లో దాదాపు 13 శాతమని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్(సీఎస్ఈ) అనే మేధో సంస్థ 'ఇండియాస్ ట్రాన్సిషన్ టూ ఈ-కుకింగ్' నివేదికలో వెల్లడించింది. దేశంలో ఎల్పీజీ కవరేజ్ 99.8 శాతంగా ఉన్నదని కేంద్ర పెట్రోలియం శాఖ చెప్పినప్పటికీ, 41 శాతం మంది ఇంకా బయోమాస్‌పై వంట చేస్తున్నట్టు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే(ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5)లో వెల్లడైందని పేర్కొన్నది.*

***ఒక్కసారీ రీఫిల్ చేయించని 50 శాతం కుటుంబాలు***

*ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం(పీఎంయూవై) భారత్‌లో ఎల్పీజీని పొందడంలో వేగవంతమైన విస్తరణకు దారితీసిందని, అయితే ఈ పథకం నుంచి లబ్ధిపొందిన వారి ఇండ్లలో 'క్లీన్ కుకింగ్' దిశగా నిరంతర పరివర్తనకు హామీ ఇవ్వలేదని అభిప్రాయపడింది. పీఎంయూవై కింద కొత్త ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు పొందిన వారిలో 50 శాతానికి పైగా కుటుంబాలు కనీసం ఒక్కసారి కూడా రీఫిల్ చేయించుకోలేదని సీఎస్ఈ తన నివేదికలో పేర్కొన్నది. దీనికి అధిక గ్యాస్ ధరలు, తాము నివసిస్తున్న ప్రాంతాల్లో ఎల్పీజీ పంపిణీ నెట్‌వర్క్ లేకపోవడం, ఇతర విశ్వాసాలు వంటివి కారణాలుగా ఉన్నాయని తెలిపింది. గత ఏడాది మార్చి వరకు గృహ వినియోగ సిలిండర్ ధరలు మండిపోయిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా దాదాపు రూ.1,100 ధర నడిచింది.*



### ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు

*50 కోట్ల మంది భారతీయులతో సహా ప్రపంచ జనాభాలో దాదాపు మూడో వంతు(సుమారు 240 కోట్లు) మందికి ఇంకా పరిశుభ్రమైన కుకింగ్ వసతులు అందడం లేదని, దీని వలన పర్యావరణంతో సహా ఆర్థిక వ్యవస్థ, ప్రజారోగ్యానికి ముప్పు కలుగుతుందని పేర్కొన్నది. ఇండోర్ వాయు కాలుష్యం కారణంగా ప్రతి ఏడాది దాదాపు 30 లక్షల మంది ప్రజలు ముందస్తుగా మరణిస్తున్నారని, వీటిల్లో అధికంగా వంటచెరకు ఆధారిత వంట వలనే చోటుచేసుకొంటున్నాయని నివేదిక తెలిపింది.*

## ఉఫ్ అంటే.. ఫోన్ అన్‌లాక్!

న్యూఢిల్లీ: ప్రతి మనిషి వేలి ముద్రలు, ఐరిస్ వేరువేరుగా ఉంటాయి. దీని ఆధారంగా ఇప్పటికే చాలా టెక్నాలజీలు అందుబాటులోకి వచ్చాయి. అలా రూపొందించిన టెక్నాలజీతోనే ఫింగర్ ప్రింట్, ఐరిస్ ద్వారా స్మార్ట్‌ఫోన్ అన్‌లాక్ చేస్తున్నాం. ఈ రెండే గాక.. సరికొత్తగా మనిషి తీసుకునే ఊపిరి లేదా శ్వాసతోనూ ఫోన్ అన్‌లాక్ చేసే దిశగా టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నారు ఐఐటీ మద్రాస్ సైంటిస్టులు. ఈ బ్రీతింగ్ టెక్నాలజీని ప్రాక్టికల్ అప్లికేషన్లుగా అభివృద్ధి చేశాక, సెల్‌ఫోన్ అన్‌లాక్ సహా భద్రతాపరమైన కార్యకలాపాల కోసం వాడొచ్చునని పరిశోధకులు చెబుతున్నారు. ఈ టెక్నాలజీ వైద్యపరంగా ఎంతగానో ఉపయోగపడుతుందని, బయోమెట్రిక్ అప్లికేషన్ రూపొందాక, ఫోన్ అన్‌లాక్, తలుపులు తెరవటం వంటివి కూడా చేయొచ్చని పరిశోధక బృందానికి నేతృత్వం వహిస్తున్న ప్రొఫెసర్ మహేశ్ చెప్పారు. మానవుల శ్వాస (బ్రీతింగ్) ఆధారంగా పరిశోధకులు అల్గారిథంను రూపొందిస్తున్నారు. 94 మంది నుంచి వివిధ రకాలుగా శ్వాసకు సంబంధించి శాంపిల్స్ తీసుకొని, అల్గారిథంను రూపొందించారు. వీటితో మనిషిని గుర్తించేందుకు జరిపిన పరీక్షల్లో 97శాతం సక్సెస్ అయ్యామని సైంటిస్టులు తెలిపారు.

## ఫిబ్రవరి 15లోగా తేల్చండి

- ఎన్సీపీ ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్‌కు గడువు విధించిన సుప్రీం

ముంబై, జనవరి 29 (నమస్తే తెలంగాణ): ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడంపై ఫిబ్రవరి 15లోగా నిర్ణయం తీసుకోవాలని మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్‌కు సుప్రీంకోర్టు గడువు విధించింది. ఇంతకు ముందు జనవరి 31 వరకు గడువు ఇచ్చింది. అయితే కొద్ది రోజుల క్రితం వరకు స్పీకర్, శివసేన పిటిషన్ల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి బిజీగా ఉన్నందున ఎన్సీపీ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేందుకు మూడు వారాల సమయం అవసరమని స్పీకర్ కార్యాలయం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పిటిషన్ దాఖలు చేశారు. విచారణ ప్రక్రియ జనవరి 31తో ముగుస్తుందని తెలిపారు. స్పీకర్‌కు మరింత సమయం ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. అనర్హత పిటిషన్లపై ఫిబ్రవరి 15లోగా తేల్చాలని తాజాగా ఆదేశించింది. 2022 మేలో శివసేనలో చీలిక ఏర్పడి ఆ పార్టీలోని కొంత మంది ఎమ్మెల్యేలు, బీజేపీ కలిసి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 2023 జూలైలో ఎన్సీపీ నేత అజిత్ పవార్, తన పార్టీని చీల్చి 40 మంది ఎమ్మెల్యేలు, 5గురు ఎమ్మెల్సీలతో కలిసి షిండే క్యాబినెట్లో చేరి ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ తిరుగుబాటు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్‌కు లేఖ అందజేశారు. అయితే స్పీకర్ పట్టించుకోక పోవడంతో శరద్ పవార్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



## జ్ఞానవాపిపై సుప్రీంలో మరో పిటిషన్

- 'శివలింగం', వజుఖానానూ సర్వే చేయాలని అభ్యర్థన

న్యూఢిల్లీ: యూపీలోని వారణాసిలో ఉన్న జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో క్షుణ్ణంగా సర్వే చేయించాలని కోరుతూ ఓ పిటిషన్ సోమవారం దాఖలైంది. 'శివలింగం', వజుఖానా (కాళ్లు, చేతులు కడుగుకొనే ప్రదేశం) 2022 మే నుంచి సీలు వేసి ఉన్నాయని, వీటిని కూడా సర్వే చేయాలని పురాతత్వ అధ్యయనాల సంస్థ (ఏఎస్ఐ)ని ఆదేశించాలని ఈ కేసులోని హిందూ పక్షం కోరింది. సీలు వేసిన ప్రాంతంలో మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ ఏఎస్ఐ సర్వే చేసిందని తెలిపింది. పిటిషనర్లకు, హిందువులకు శివ లింగాన్ని దర్శించుకుని, పూజలు చేసే హక్కు ఉందని పేర్కొన్నది. ఇక్కడ ఉన్నది శివలింగమా? ఫౌంటెనా? అనేది నిర్ధారణ కావాలంటే, సీలు చేసిన స్థలంలో పూర్తిగా శాస్త్రీయ సర్వే జరగాలని తెలిపింది. అయితే ముస్లిం పక్షం వాదన ప్రకారం, 2022 మే నెలలో కనిపించినది శివలింగం కాదు, కేవలం ఫౌంటెన్ మాత్రమే. మసీదు కింద ఆలయం ఉండేదని ఏఎస్ఐ సర్వేలో తేలిన విషయం తెలిసిందే.

## గాడ్సే పేల్చిన బుల్లెట్ వల్ల గాంధీ చనిపోలేదు!

**సావర్కర్ మునిమనవడు రంజిత్**

ముంబై, జనవరి 29 (నమస్తే తెలంగాణ): నాథూరామ్ గాడ్సే పేల్చిన బుల్లెట్ వల్ల గాంధీజీ చనిపోలేదని వీర్ సావర్కర్ మునిమనవడు రంజిత్ సావర్కర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో దర్యాప్తు సరిగ్గా జరుగలేదని, అందుకే గాంధీ హత్యతో నెహ్రూ కుటుంబానికి ఎక్కువ ప్రయోజనం చేకూరిందన్నారు. ఈ విషయాన్ని ఆయన ప్రచురించిన పుస్తకంలో పేర్కొన్నారు. ఫోరెన్సిక్ విచారణ ద్వారా ఈ ప్రకటన చేస్తున్నట్టు తెలిపారు. గాంధీ హత్య జరిగిన 20 ఏళ్ల తర్వాత కపూర్ కమిషన్ వేసినట్టే.. అణచివేయబడిన సాక్ష్యాలను బయటకు తీసుకురావడానికి మరో కమిషన్ వేయాలన్నారు.

## 'సిమి'పై నిషేధం మరో ఐదేండ్లు పొడిగింపు

న్యూఢిల్లీ: ఉగ్రవాద సంస్థ స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి)పై నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఐదేండ్లు పొడిగించింది. దేశంలో మత సామరస్యానికి విఘాతం కలిగించడం, ఉగ్రవాదాన్ని పురిగొల్పడం వంటి చర్యలకు ఈ సంస్థ పాల్పడినందుకు ఈ చర్య తీసుకుంది. దీనికి సంబంధించిన ఆదేశాలను ప్రభుత్వం సోమవారం జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం సిమిపై 2001లో మొదటిసారి నిషేధం విధించింది. అప్పటి నుంచి ఐదేండ్లకొకసారి నిషేధాన్ని పొడిగిస్తున్నారు.

## కుల, మతాల ప్రస్తావన ఆపండి: సుప్రీం

న్యూఢిల్లీ: కోర్టు కేసుల్లో వాది, ప్రతివాదులు, నిందితులు, కక్షిదారుల కుల, మతాలను ప్రస్తావించడాన్ని తక్షణమే నిలిపేయాలని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. తన రిజిస్ట్రీతోపాటు, దేశంలోని అన్ని న్యాయస్థానాలకు ఈ ఆదేశాలను జారీ చేసింది. కక్షిదారు ఏ కులం లేదా ఏ మతానికి చెందిన వారో 'మెమో ఆఫ్ పార్టీస్'లో కనిపించకుండా చర్యలు తీసుకోవాలని అన్ని హైకోర్టులను ఆదేశించింది. సబార్డినేట్ కోర్టుల్లో కూడా ఈ ఆదేశాలు అమలయ్యేలా చూడాలని హైకోర్టులకు తెలిపింది.

